
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 16-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 673 పేజీలు: 4 వెల : రూ.7



* పేటలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం * ప్రజావేదిక బహిరంగ సభ * టీడీపీ శ్రేణులతో సమావేశం
* సీఎం పర్యటనకు అంతా సిద్ధం
* ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
* సామాన్యులకు అసౌకర్యం కలిగించొద్దు * భద్రతా ఏర్పాట్లలో రాజీ పడొద్దు * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



# నేడు ముఖ్యమంత్రి.. నరసన్నపేట పర్యటన

**నరసన్నపేట/శ్రీకాకుళం, మే 15 (వార్త):** స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు శనివారం నరసన్నపేటకు రానున్నారు. నరసన్నపేట సమీపంలోని సత్యవరం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెత్త సేకరణ కేంద్రం వద్ద ప్లాస్టిక్ గ్రేడింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. నరసన్నపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభ నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకూ జరిగే పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. సీఎం పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లుపై జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రీనివాస్, రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్, స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, జేసీ, ఆర్డీవోలు శుక్రవారం పరిశీలించారు. నరసన్నపేటలో రూట్ మ్యాప్, సభాస్థలి పరిశీలన, ముఖ్యమంత్రి పర్యటనకు రానున్న నేపథ్యంలో, నరసన్నపేట సమీపంలోని తామరాపల్లి హెలిప్యాడ్, ముఖ్యమంత్రి సభకు ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సభా కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పర్యటన విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యామ్నాయ మార్గాల రూపకల్పన చేపట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం మైదానాలను తక్షణమే చదును చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సత్యవరం కూడలి వద్ద వ్యర్థాల నిర్వహణ (చెత్త నుంచి సంపద) కేంద్రం, ప్లాస్టిక్ గ్రేడింగ్ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా రూట్ మ్యాప్ రూపొందించాలని, వీఐపీల ప్రొటోకాల్, భద్రతా ఏర్పాట్ల విషయంలో రాజీ పడవద్దని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. రూట్ మ్యాప్ ఖరారు.. సామాన్యులకు అసౌకర్యం కలగవద్దుముఖ్యమంత్రి రాక సందర్భంగా నరసన్నపేట, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా, రవాణా ఏర్పాట్లపై మంత్రి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక ప్రజలకు, సామాన్య ప్రయాణికులకు ట్రాఫిక్ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా సీఎం హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభావేదిక వద్దకు చేరుకునే కీలకమైన రూట్ మ్యాప్‌ను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రద్దీ నియంత్రణకు ముందస్తుగానే బారికేడ్లు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడానికి మైదానాలను తక్షణమే చదును చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవోలు, డీఎస్పీ, ఇతర పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కాన్వాయ్ ట్రయల్ రన్ పరిశీలన

ముఖ్యమంత్రి నరసన్నపేటలో పర్యటనకు సంబంధించిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి భద్రతా అధికారులతో కలిసి శుక్రవారం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుంచి కార్యకర్తల సమావేశం వేదిక, ప్రజా సభా ప్రాంగణం, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, ఇతర పర్యటన ప్రాంతాలకు వెళ్లే మార్గాలను జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారి పరిస్థితులు, ముఖ్య కూడళ్లలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, పటిష్ట బ్యారికేడింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర



సేవల సమన్వయంపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు, ప్రజా రవాణాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల సౌకర్యం, పర్యటన సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, భద్రత పరంగా ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. భద్రత పరంగా ఎటువంటి లోపాలు ఉండకూడదని అధికారులకు సూచించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సమావేశమై విధులకు నియమించబడిన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్ల వద్ద నిర్ణీత సమయానికి హాజరై, ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. సెక్టార్ ఇన్‌చార్జ్ అధికారులు తమ పరిధిలోని సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ ట్రయల్ రన్‌లో పోలీసు అధికారులు, ప్రత్యేక భద్రతా అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ డ్రోన్ కెమెరాల వినియోగంపై నిషేధం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరమైన చర్యల్లో భాగంగా ప్రైవేట్ డ్రోన్ కెమెరాల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, హెలిప్యాడ్ పరిసరాలు, సభా ప్రాంగణం, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, రహదారి మార్గాలు, పరిసర ప్రాంతాల్లో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక అనుమతి లేకుండా ఎటువంటి ప్రైవేట్ డ్రోన్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ చేయడం, వీడియోలు లేదా ఫోటోలు తీయడం, ప్రత్యక్ష ప్రసారం చేయడం పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.



## విజయవంతం చేయాలి: కేంద్ర మంత్రి రామ్మోహన్

నరసన్నపేటలో శనివారం జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చెయ్యాలని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తిలతో కలసి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా వేదిక వద్ద సభ కార్యక్రమ వివరాలను, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన విషయాలను జేసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పి మహేశ్వర రెడ్డిలు కేంద్ర మంత్రికి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతీ నెల మూడవ శనివారం నిర్వహిస్తూ వస్తున్నామని.. నరసన్నపేటలో శనివారం జరిగే కార్యక్రమం సైతం విజయవంతం అవ్వాలని కోరారు. కార్యక్రమ ప్రధాన ధ్యేయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అనంతరం కార్యకర్తలతో సైతం భేటి అవుతారన్నారు. రాష్ట్రానికి సరికొత్త బ్రాండ్ సృష్టించి విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నారని.. మరోవైపు శ్రీకాకుళం జిల్లాలో సైతం అయన దిశా నిర్దేశంలో ఇరిగేషన్, ఇండస్ట్రీస్ అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని అన్నారు. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ బ్రాండ్‌గా మార్చడంతో లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని, ఇందులో అనేక వాటిని ప్రారంభోత్సవం చేసుకోగా.. మరికొన్ని నిర్మాణ దశలో ఉండి.. అతి త్వరలోనే ప్రారంభోత్సవం జరుపుకుంటూ ఉండటం శుభపరిణామం అని అన్నారు. దీని వల్ల తెలుగు యువతకు, తెలుగు ప్రజలకు విశేష లాభం చేకూరనుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సైతం చంద్ర బాబు నాయుడు పర్యటన సమయంలో జిల్లా లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, పెండింగ్ సమస్యలను అయన దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లా అభివృద్ధికి ఈ రెండేళ్లలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించాయని గుర్తు చేసిన రామ్మోహన్ నాయుడు.. .. అందువల్లే నేరెడి లాంటి దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించుకోగాలిగామని అన్నారు. అతి త్వరలో నేరెడి పనులు కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

## టూర్.. షెడ్యూల్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. నరసన్నపేటలో నిర్వహించనున్న 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సీఎం పర్యటన షెడ్యూల్ ప్రకారం.. ఉదయం 9 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10:40 గంటలకు నరసన్నపేట మండలం తామరాపల్లి హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా ప్రజావేదిక వద్దకు చేరుకుని, మధ్యాహ్నం 12:45 గంటల వరకు పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై నిర్వహించే సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గత 16 నెలలుగా ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛతా ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ముఖ్యమంత్రి ఈ పర్యటన చేపడుతున్నారు.సభా కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి నరసన్నపేటలోని ఎస్‌డబ్ల్యూపీసీ (ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం) షెడ్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 1:20 గంటలకు అక్కడ ప్రజలతో నేరుగా ముచ్చటించి, స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై ఆరా తీస్తారు. అనంతరం తామరాపల్లిలో పార్టీ కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 3:55 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి తిరిగి అమరావతి చేరుకుంటారు.



# 20న మందస మండల సర్వసభ్య సమావేశం



**మందస, మే 15(వార్త):** మందస మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించబడుతుందని మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ తెలిపారు. మందసలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మందస మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 20(బుధవారం)న ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన నిర్వహించబడుతుందని, సంబంధిత శాఖాధికారులు సమావేశానికి తమ శాఖల యొక్క ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ వెంకటరమణ కోరారు.



# కాలువలో పడి యువకుడి మృతి

## -మృతుడిని గుర్తించిన పోలీసులు

**నరసన్నపేట, మే 15(వార్త):** నరసన్నపేట మండలం గొట్టిపల్లి జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అనంతరం పోలీసులు మృతుడి వివరాలను గుర్తించారు. స్థానికుల వివరాల ప్రకారం.. యువకుడు గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడిపోయి మృతి చెందినట్లు అనుమానించారు. సమాచారం అందుకున్న ఎస్సై బి. గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తదుపరి విచారణలో మృతుడు నరసన్నపేట పట్టణానికి చెందిన అనుపోతుల శ్రీనివాసరావు (34)గా పోలీసులు గుర్తించారు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కాలువ గట్టుకు ఢీకొని కాలువలో పడిపోవడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై-2 శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.





# రాంపురం ప్రజలకు అందిన తాగునీరు

## -'జాతీయ వార్త'

## కథనానికి స్పందన

**మందస, మే 15(వార్త):** 'రాంపురంలో దాహం కేకలు' అనే శీర్షికన రాంపురం ప్రజల మంచినీటి సమస్యలపై 'జాతీయ వార్త' కథనం ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు.

మందస మండ లం రాంపురం పంచాయతీ పరిధిలోని రాంపురం గ్రామంలో కొన్ని రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను జాతీయవార్త ఈనెల 14న వెలుగులోకి తీసుకురావడంతో గ్రామ సచివాలయ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకున్నారు. సమస్యను పరిష్కరించారు. గ్రామంలోని తాగునీటి బోరు మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు తిరిగి నీటి సరఫరా అందుబాటులోకి తీసుకువచ్చారు. వేసవి కాలంలో ప్రజలు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ స్యపై స్పందించిన గ్రామ సచివాలయ సిబ్బందికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్య లను వెంటనే గుర్తించి పరిష్కరించడం అభినందనీ తయమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అధికా రులు మరింత శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

## -రౌండ్ టేబుల్

## సమావేశం డిమాండ్



**పలాస, మే 15 (వార్త):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు యస్సి హోదాకై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ పత్తిరి దానేసు మాట్లాడుతూ క్రైస్తవంలోకి మారితే షెడ్యూల్డ్ కులాల హోదా రద్దు చేయటం రాజ్యాంగ విరుద్ధం ఆర్టికల్ 14,25 సమానత్వం, మత స్వేచ్ఛ, హక్కులకై దళిత పీడీత ప్రగతిశీల వామపక్ష సంఘాల ఐక్యతతోనే దళిత క్రైస్తవులకు యస్సి హోదా సాధించగలమని అన్నారు. డీటీఫ్ నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏ మతం స్వీకరించే హక్కు ఉండేటప్పుడు ప్రత్యేకంగా దళితులు ముస్లిం, క్రైస్తవ మతం స్వీకరిస్తే ఎస్ సి హోదా కోల్పోవడం అన్యాయమని, జస్టిస్ కేజీ బాలకృష్ణన్ ఇచ్చిన రిపోర్టు రాకముందే ఈ తీర్పు ఇవ్వడం అన్యాయం అని అన్నారు.

కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క.కృష్ణయ్య మాట్లాడుతూ 1950 రాష్ట్రపతి ఉత్తర్వును పార్లమెంట్లో చర్చించి రద్దు చేయాలి, సుప్రీం కోర్టు తీర్పును పార్లమెంట్ లో చర్చించి రద్దు చేయాలి, దళిత క్రైస్తవులకు ఎస్ సి హోదా కల్పిస్తూ చట్టం చేయాలనీ అన్నారు. తామాడ అరుణ మాట్లాడుతూ దళితులు క్రైస్తవులు గా మారిన వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు మారలేదని, మైనారిటీ కమిషన్ రిపోర్ట్, మండల్ కమిషన్ రిపోర్ట్, జస్టిస్ రంగనాథమిశ్రా కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన కేజీ బాలకృష్ణ రిపోర్ట్ లు ఇచ్చిన వాటిని చదవకుండా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమని అన్నారు. దేశావ్యాప్తంగా దళిత సంఘాలు, పీడీత వామపక్ష పార్టీలు ఐక్య పోరాటాలు ద్వారానే దళిత క్రైస్తవులు ఎస్ సి హోదా సాధించగలమని అన్నారు. జై భీమ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు దుర్యోధన మాస్టారు, పద్మలోచన శంకర్రావు, భార్గవ్, ధర్మారావు ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే పెద్ద ప్రయత్నము జరుగుతున్నదని, ఇందులో భాగమే 1950 చట్టాన్ని తేవడం దీనికి వ్యతిరేకంగా దేశంలో మేధావులు బుద్ధి జీవులు ప్రజాస్వామ్యవాదులు కలసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, ప్రగతి శీల కార్మిక సమైక్య ,అమరుల బంధుమిత్రుల సంఘం , తో పాటు పిఓడబ్ల్యు మహిళా సంఘం జిల్లా బాధ్యులు కుసుమ, స్వేచ్ఛ మహిళా సంఘం నాగమణి ఎం ఎస్ ఎస్ జిల్లా అధ్యక్షులు పిట్ట.గీతా రాణి, వాముపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ లిబరేషన్ నాయకులు సన్యాసిరావు, మద్దిల రామారావు, ఇప్వా మహిళా సంఘ నాయకులు తామడ అరుణ హాజరై తమ తమ అభిప్రాయం తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని రౌండ్ సమావేశాన్ని విజయవంతం చేశారు.

# బారువ జోల బట్టిలో చేపలే..చేపలు!



**సోంపేట, మే 15(వార్త):** బారువలో గల జోలబట్టిలో శుక్రవారం విపరీతంగా చేపలు లభించాయి. ఎండలు అధికంగా ఉండడంతో బట్టిలో నీరు బాగా తగ్గిపోవడంతో అందులో పెరుగుతున్న జెల్ల చేపలు విపరీతంగా తేలిపోవడంతో బారువ గ్రామస్తులకు శుక్రవారం ఉదయం ఎంతో సందడిగా మారింది. ముందుగా గమనించిన బారువాకు చెందిన రాజేష్ ఖన్నా గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో యువకులు రైతులు బట్టి వద్దకు చేరుకొని చేపల వేట కోసం వెంపర్లాడారు. చాలామంది చేపలను బజారులో కూడా వేలాది రూపాయలకు విక్రయించి సరదాగా సొమ్ము చేసుకున్నారు. ఇంకా చాలామంది తమ కుటుంబాలకు బంధువులకు చేపలను పంచిపెట్టారు. బట్టిలో నీరు తగ్గడం వల్ల ఆక్సిజన్ సరిగ్గా అందక చేపలు పైకి తేలిపోయాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.









# వేసవిలో కిశోరి వికాసంతో మేలు

## - ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ

## -అంగన్ వాడీ కేంద్రాల్లో

## అవగాహన సదస్సులు

**మందస, మే 15(వార్త):** వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ పెద్దింటి అరుణ చెప్పారు.

మందస మండలంలోని సిరిపురం, చిన్నకోస్టా అంగన్ వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ పై జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా అవగాహన కూడా కల్పించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం సందర్శించారు. గర్భవతులకు తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా ఉండడానికి కౌన్సిలింగ్, వైద్యుల సలహాలు తీసుకోవడం వంటి విషయాలను వివరించారు. కిశోరి వికాసం కార్యక్రమం వేసవి సెలవుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం జీవన నైపుణ్యాలపై సీడీపీఓ అరుణ ఆధ్వర్యంలో బాలబాలికలకు అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది. కాగా, స్థానిక ప్రజలు ఒరియా భాష నేపధ్యం కలిగిన వారు కావడంతో స్థానిక ఉపాధ్యాయురాలు శ్యామల కుమారి వారికి ఒరియా భాషలో ఈ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పి.జయలక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రభుత్వ బడుల్లో చిన్నారులను చేర్పించాలి

## -మందస మండల విద్యాశాఖ అధికారి మర్రిపాటి లక్ష్మణరావు

## -లొహరిబందలో

## చిన్నారుల స్పెషల్ అడ్మిన్ డ్రైవ్

**మందస, మే 15(వార్త):** ప్రభుత్వ బడుల్లో చిన్నారులను చేర్పించాలని మందస మండల విద్యాశాఖ అధికారి మర్రిపాటి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మందస మండలంలోని లొహరిబందలో చిన్నారుల స్పెషల్ అడ్మిన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల పిల్లలు ఊర్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో జాయినింగ్ కోసం ఈ ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సౌకర్యాలు, ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యకోసం తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.మురళీమోహన్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## స్వచ్ఛ రథాన్ని తనిఖీ చేసిన పంచాయతీ రాజ్ కమిషనర్

**జలుమూరు, మే 15 (వార్త):** జలుమూరులోని స్వచ్ఛ రథాన్ని పంచాయతీ రాజ్ కమిషనర్ ఎం.వి.ఆర్.కృష్ణతేజ శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామ పరిశుభ్రత కార్యక్రమాల అమలుపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జలుమూరులో ప్రతిరోజూ ఎంత మేర చెత్త సేకరిస్తున్నారో, స్వచ్ఛ రథం ద్వారా నిత్యావసర వస్తువుల అమ్మకాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణలో స్వచ్ఛ రథం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. స్వచ్ఛ రథం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా చెత్త వర్గీకరణలో సహకరించాలని సూచించారు. ఈ తనిఖీలో సీఈఓ వెంకట్రామన్, డీపీఓ స్వరూపరాణి తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఎం.గడూరులో చర్చనీయాంశమైన కుటుంబ వివాదం

**-కుటుంబం కోసం విదేశాల్లో కష్టపడ్డ తండ్రీ..కొడుకులు**

**-ఇప్పుడు కుటుంబ కలహాల మధ్య ఆవేదన**

**-గర్భిణి కోడలితో కలిసి ఇంటి బయట నిలిచిన కుటుంబసభ్యులు**

**పలాస, మే 15 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం ఎం.గడూరులో వెలుగులోకి వచ్చిన ఓ కుటుంబ వివాదం కలకలం రేపింది. కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న విభేదాలు ఇప్పుడు గ్రామంలో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. ఎన్నేళ్లుగా కుటుంబం కోసం విదేశాల్లో కష్టపడి పనిచేసిన భర్త.. సముద్ర ప్రయాణ ఉద్యోగం చేస్తూ సంపాదనను ఇంటికే పంపిన కుమారుడు.. ఇప్పుడు అదే కుటుంబంలో చోటుచేసుకున్న వివాదాల కారణంగా మానసిక ఆవేదన చెందుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం ఎం.గడూరుకు చెందిన సాతుపల్లి షణ్ముఖరావు విదేశాల్లో వలస కార్మికుడిగా పనిచేసి కుటుంబాన్ని పోషించాడని తెలుస్తోంది. అతని కుమారుడు సునీల్ అలియాస్ సుదర్శన్ సీమెన్‌గా పనిచేస్తూ సంపాదనను కుటుంబ అవసరాలకే వినియోగించేవాడని గ్రామస్తులు చెబుతున్నారు.



అయితే ఇటీవల కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఇంట్లో చోటుచేసుకున్న విభేదాల కారణంగా భర్త, కుమారుడు, ఐదు నెలల గర్భిణి కోడలు కొంతసేపు ఇంటి బయట ఉండాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఈ ఘటన గ్రామంలో చర్చకు దారితీసింది. అనంతరం వారు ఇంట్లోకి వెళ్లినప్పటికీ కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయని వాపోతున్నారు. కుటుంబ పెద్దలు, బంధువుల స్థాయిలో పలుమార్లు రాజీ ప్రయత్నాలు జరిగినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. ఇక కుటుంబ సభ్యుల మధ్య మాటామాటా పెరగడంతో మానసిక ఒత్తిడి ఎక్కువైందని బాధితులు పేర్కొంటున్నారు. "ఇన్నేళ్లు కుటుంబం కోసమే కష్టపడ్డాం.. ఇప్పుడు ప్రశాంతంగా జీవించే పరిస్థితి కావాలి" అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణి మహిళ ఈ పరిణామాలతో తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతోందని గ్రామస్తులు అంటున్నారు. ఈ వ్యవహారం గ్రామంలో హ్యూమన్ ఇంట్రెస్ట్ అంశంగా మారింది. వృద్ధాప్యంలో ప్రశాంత జీవితం గడపాల్సిన భర్త.. భవిష్యత్తు కోసం కష్టపడిన కుమారుడు.. తల్లితనం కోసం ఎదురుచూస్తున్న గర్భిణి కోడలు ఇప్పుడు కుటుంబ విభేదాల కారణంగా ఆందోళనలో ఉండటం పలువురిని కలిచివేస్తోంది. కుటుంబ వివాదం మరింత ముదరకుండా అధికారులు, గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇరు వర్గాల మధ్య చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, ఈ వ్యవహారంపై ఇతర కుటుంబ సభ్యుల స్పందన తెలియాల్సి ఉంది.



## ఎన్నికల హామీల అమలుపై
# సీఎం సమాధానం చెప్పాలి

**- సీపీఐ డిమాండ్**

**నరసన్నపేట, మే 15(వార్త):** నరసన్నపేటలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ప్రభుత్వ విధానాలు, స్థానిక సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపర వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఎన్ని అమలు చేశారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

నరసన్నపేటలో జరుగుతున్న భూదోపిడీ, ఆక్రమణలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో విడతల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



**నరసన్నపేట, మే 15(వార్త):** లుకలాం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం బాబూరావు తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక క్లాసులు చేపట్టినట్లు చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరై విద్యార్థులకు బోధన అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరై పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని తెలిపారు. ఈ ప్రత్యేక తరగతులు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్నట్లు హెచ్ఎం వెల్లడించారు.

# మైదానాన్ని తలపిస్తున్న ఎంకు చెరువు

**- పునరుద్ధరణకు రైతుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, మే 15(వార్త):** నరసన్నపేటలోని కరగాం పంచాయతీ నర్సింగపల్లి వెళ్లే మార్గంలో ఉన్న ఎంకు చెరువు ప్రస్తుతం మైదానాన్ని తలపిస్తూ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఒకప్పుడు సుమారు 50 ఎకరాలకు సాగునీరు అందించిన ఈ చెరువు ఇప్పుడు పూడికలతో నిండిపోయి తన ఉనికిని కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. గత కొన్ని సంవత్సరాలుగా చెరువులో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందని చెబుతున్నారు. వర్షాకాలంలో కూడా నీరు నిల్వ ఉండకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఉపాధి హామీ పనుల ద్వారానైనా చెరువును పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పూడిక తొలగించి చెరువును అభివృద్ధి చేస్తే మళ్లీ సాగునీరు అందించి పంటలు పండే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వంశధార, మైనర్ ఇరిగేషన్ పనులకు
# రూ.2 కోట్లతో మరమ్మతులు

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, మే 15 (వార్త):** వంశధార, మైనర్ ఇరిగేషన్ పనులకు 2 కోట్లతో మరమ్మత్తు పనులకు శుక్రవారం ప్రారంభించారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు గ్రామ సమీపంలో కాలువ మరమ్మత్తు పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు.వంశధార, మైనర్ ఇరిగేషన్ పనులకు సుమారు రూ. 2కోట్లు నిధులతో చేపట్టనున్న ఈ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా కాలువల మరమ్మత్తులు అత్యంత అవసరమని అన్నారు. ప్రతి రైతు చెయ్యకు పని, ప్రతి చేతికి నీరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వంశధార కాలువ ద్వారా పరిసర గ్రామాల రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కాలువల పునరుద్ధరణ పనులను ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలువ మరమ్మత్తు పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. సాగునీటి పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయం చైర్మన్ పీరుకట్ల విఠల్,నీటి సంఘం నాయకులు గుణప్ప నిరంజన్ గుణప నిరంజన్, టిడిపి కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.








# బాల బాలికలకు కిశోరి 'వికాసం'

**-ఐసీడీఎస్ సీనియర్**

**- సూపర్‌వైజర్ రామలక్ష్మి**

**మందస, మే 15(వార్త):** బాలబాలికలకు కిశోరి వికాసం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సీనియర్ సూపర్ వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి అన్నారు. మందస మండలంలోని పెట్టువ, హంసరాళి, కుంబిగాం, మందసలలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ జీవన నైపుణ్యాలపై బాల బాలికలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారుర. గర్భవతులకు తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా ఉండడానికి కౌన్సిలింగ్, వైద్యుల సలహాలు ఎలా తీసుకోవాలో చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి సెలవులలో శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు సుభద్రరాణి, విమలకుమారి, జయమ్మ, కామేశ్వరి, మంగాదేవి, పద్మ, సుధ, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# సీఎం పర్యటన నేపథ్యంలో డ్రోన్లపై నిషేధం



**నరసన్నపేట, మే 15(వార్త):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం నరసన్నపేటలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రజలు పోలీసు శాఖ జారీ చేసిన నియమాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ ఎం. శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మే 15, 16 తేదీలలో నరసన్నపేట పట్టణ పరిధిలో ప్రైవేటు డ్రోన్ల ఎగురవేతకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా అనుమతి లేకుండా డ్రోన్లు ఎగురవేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. పోలీసు శాఖ సూచనలను పాటించి భద్రతా ఏర్పాట్లకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

## ఖరీఫ్‌కు ముందే వంశధార

# కాలువలు పూర్తి చేయాలి



**నరసన్నపేట, మే 15(వార్త):** మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వంశధార కాలువల పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. నరసన్నపేట మండల కేంద్రంలోని పలు వంశధార కాలువలు ప్రస్తుతం పూడికలు, కలుపు మొక్కలతో నిండిపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో భారీగా పూడిక పేరుకుపోవడంతో పాటు గుర్రపు డెక్క మొక్కలు విస్తరించాయని, ఈ పరిస్థితుల్లో సాగునీరు సక్రమంగా వెళ్లే అవకాశం కనిపించడం లేదని రైతులు అంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన నీరు అందకపోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్ ముందు కాలువల శుభ్రపరిచే పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఈసారి ఇంకా పనులు ప్రారంభం కాకపోవడం రైతుల్లో అసంతృప్తికి దారితీస్తోంది. అధికారులు వెంటనే స్పందించి పూడికతీత, కలుపు తొలగింపు పనులు చేపట్టాలని కోరుతున్నారు. కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రపరిస్తేనే సాగునీరు చివరి ఆయకట్టుకు చేరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

## పంట కాల్వపై ..

# పంజా..!

**-జాతీయ రహదారి పక్కనే అక్రమ రోడ్డు నిర్మాణం**

**-సైడ్‌వాల్ కూల్చి వరద కాలువను మింగేసిన భూకబ్జాదారులు**

**పలాస, మే 15 (వార్త):** భూ కబ్జాదారుల కనపడితే ఎలాంటి భూములు కైనా వదులుకోవాల్సిన పరిస్థితి ఈ ప్రాంతంలో నెలకొంది. కాలువలు, జిరాయితి భూములు ఖాళీగా ఉంటే ఆ భూములకు ఆశలు వదులుకోవాలని పలువురు భావిస్తున్నారు. పలాస మండలంలో భూకబ్జాదారుల బరితెగింపు మరోసారి వెలుగులోకి వచ్చింది. శాసనం సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పంట కాల్వను ఆక్రమించి అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ భూములు, పంట కాల్వలు, వరద మార్గాలు కూడా ఇప్పుడు కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కుకుంటున్నాయంటూ ప్రజలు మండిపడు తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం... జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 20 అడుగుల వెడల్పు గల పంట కాల్వపై మట్టి పోసి అక్రమ రహదారి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం నేషనల్ హైవే సర్వీస్ రోడ్డుకు నిర్మించిన సైడ్‌వాల్‌ను ధ్వంసం చేసి, కాల్వ నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నట్లు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. భారీ యంత్రాలతో రాత్రివేళల్లో పనులు నిర్వహించి కాల్వ ఆకారాన్నే మార్చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వలను రక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం ఇప్పటివరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. "ముడుపులు తీసుకుని అధికారులు మౌనం వహిస్తున్నారు" అంటూ స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కాల్వ ఆక్రమణ కారణంగా భవిష్యత్తులో వరదనీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పరిసర ప్రాంతాలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పలాస పరిసర ప్రాంతాల్లో చెరువులు, పంట కాల్వలు, వరద మార్గాలు వరుసగా ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే... నేషనల్ హైవే అథారిటీ అనుమతి లేకుండా సర్వీస్ రోడ్డులో మార్పులు చేయడం, సైడ్‌వాల్‌ను కూల్చివేయడం చట్టవిరుద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఎవరూ అడ్డుకోకపోవడం వెనుక పెద్దల ఆశీర్వాదం ఉందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా పంట కాల్వను ఆక్రమించి రోడ్డు నిర్మించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని, ధ్వంసమైన సైడ్‌వాల్‌ను పునర్నిర్మించాలని, కాల్వను యథాతథ స్థితికి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం జోక్యం చేసుకుని ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలాస మండల తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తిని వివరణ కోరగా "ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఇరిగేషన్ శాఖ, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తాం" అని స్పష్టం చేశారు.







# కలెక్టర్ ఆదేశాలూ పట్టవా..?

**-చెత్త సమస్యకు లభించని పరిష్కారం**



**నరసన్నపేట, మే 15(వార్త):** నరసన్నపేట కొత్తకర్ర చెరువు ప్రధాన రహదారిపై పేరుకుపోతున్న చెత్త నిల్వను తొలగించాలని గాంధీనగర్ వాసులు గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ చెత్తను తొలగించాలని సంబంధిత ఈవోకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే శుక్రవారం ఉదయం పంచాయతీ అధికారులు చెత్తను పూర్తిగా తొలగించకుండా దానిపై గడ్డి కప్పి ఉంచుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సమస్య యథాతథంగా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని, ప్రయాణికులు, సమీప నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గాంధీనగర్ వాసులు తెలిపారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని అంటున్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కూడా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, మే 15 (వార్త):** ప్రజల సమస్యలే పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక -- ప్రజాదర్బార్ నిర్వహణ చేపట్టారు. నియోజకవర్గలో టిడిపి పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన "ప్రజా పరిష్కార వేదిక -- ప్రజా దర్బార్" కార్యక్రమం అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే కు వినిపించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర సమస్యలకు సంబంధించిన 21 మంది వినతిపత్రాలను అందించారు. పలాస ఎమ్మెల్యే ప్రజల వినతులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రధాన బాధ్యతని, ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వేగవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కబడ్డీ లీగ్‌లో

# ఉద్దానం వారియర్స్ ఘన విజయం


**పలాస, మే 15 (వార్త):** కాశీబుగ్గ – పలాస మున్సిపాలిటీ పరిధిలోని మంకినమ్మ క్రీడా మైదానంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన "ఉద్దానం పలాస కబడ్డీ లీగ్" పోటీలు క్రీడాభిమానుల సందడి మధ్య ఉత్సాహంగా ముగిశాయి. పలాస, ఉద్దానం ప్రాంతాల నుంచి పలువురు జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఉద్దానం వారియర్స్ (కుమార్ టీ పాయింట్ జట్టు) అద్భుత ప్రదర్శన కనబరిచి మొదటి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ ట్రోఫీ, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలకు మంచి ఆదరణ లభించడం సంతోషకరమన్నారు. యువత క్రీడలను అలవాటు చేసుకోవడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇలాంటి పోటీలను తరచుగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




# అందరివాడు మందస ఎస్ఐ కృష్ణప్రసాద్

**-విధులు ఓ వైపు.. బాధ్యతలు మరో వైపు**

**-సమాజ మార్గదర్శిగా నిలుస్తున్న వైనం**



**మందస, మే 15(వార్త):** ఉద్యోగం ప్రతీ ఒక్కరూ చేస్తారు.. కానీ, ప్రజల్లో కొందరే గుర్తుంటారు.. ఉద్యోగంతో పాటు ప్రజల మెప్పు పొందిన అధికారి ప్రజల గుండెల్లో చిరకాలం ఉంటారు.. విధులు, బాధ్యతలతో పాటు సమాజాన్ని సన్మార్గంలో పెడుతున్న మందస ఎస్ఐ 'కూటికుప్పల కృష్ణప్రసాద్' నిజంగానే మంచి అధికారి. అందరి మన్ననలు పొందుతూ.. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. కృష్ణప్రసాద్ ఉద్యోగ ప్రయాణం పదిమందికి ఆదర్శంగా నిలుస్తుంది. మందస మండలం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ఆయన 2025 జనవరి బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి నేటివరకు ఆయన వివాదరహితునిగా ఉద్యోగం చేస్తున్నారు. పలు సమాజహితమైన కార్యక్రమాలు చేశారు. ప్రజలు పథకాలు, చట్టాలు, కొత్త చట్టాలను ప్రజలకు వివరించి, అవగాహన కల్పించారు. ప్రాణాల విలువ తెలియజేస్తే ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాదు.. ఆయనో ఆధ్యాత్మిక వేత్త. స్థితప్రజ్ఞునిగా చెప్పుకోవచ్చును. పోలీసులకు నిత్య సవాళ్లు సర్వసాధారణం. అయినా.. కృష్ణప్రసాద్ ఉద్యోగ ధర్మంలో చెక్కుచెదరని మనస్తత్వం. మహిళల రక్షణకు ప్రభుత్వ కల్పిస్తున్న రక్షణ, ఆన్ లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిత్యం ప్రజలను అలెర్ట్ చేస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఆత్మ రక్షణ కళల్లో కూడా కృష్ణప్రసాద్ అందెవేసిన చేయి.

మందస మండలంలోని బెల్లుపట్టియా గ్రామంలో జరిగిన శ్రీకిల్లమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలకు బందోబస్తు దృష్ట్యా వెళ్లారు. అయితే.. అక్కడ ఆయన ఆత్మరక్షణ కర్రసాము ఎలా ఉపయోగపడుతుందో స్వయంగా ప్రదర్శించి, చూపించారు. దీంతో ఉత్సవాలకు హాజరైన వందలాది మంది ఆయన అద్భుత ప్రతిభ చూసి, ఆశ్చర్యపోయారు. ఎస్ఐ కృష్ణప్రసాద్ అన్ని రంగాల్లో ఆరితేరిన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మాటల్లో కూడా పోలీసింగ్ కనిపించదు. కాఠిన్యం ఉండదు. ఫ్రెండ్లీ పోలీసింగ్ మాత్రమే కనిపిస్తుంది. దీంతో ఇటు అధికార, ప్రతిపక్షాల మధ్య మంచి అధికారిగా ఆయన ప్రస్థానం కొనసాగుతోంది. వివాదరహితునిగా కొనసాగుతున్న కృష్ణప్రసాద్ పయనం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.




# అంపలాం పాఠశాలలో స్పెషల్ క్లాసులు

**నరసన్నపేట, మే 15(వార్త):** నరసన్నపేట మండలం అంపలాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం కే. పుణ్యవతి తెలిపారు. వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులు చదువుపై దృష్టి సారించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల సమ్మర్ వర్క్ బుక్కులను పరిశీలించిన అనంతరం వారికి పాఠాలను బోధించారు. సెలవు రోజుల్లో విద్యార్థుల్లో అభ్యాసపు అలవాటు కొనసాగించేందుకు ఈ ప్రత్యేక తరగతులు ఉపయోగపడుతున్నాయని వివరించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతిరోజూ చదువుకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై శ్రద్ధ తీసుకుని సహకరించాలని కోరారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని హెచ్ఎం తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546